నమస్తే తెలంగాణ

భద్రాద్రి కొత్తగూడెం



## 'బీఆర్ఎస్' సమావేశంలో జిల్లా నేతలు

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బుధవారం నిర్వహించిన పార్టీ విస్తృతస్థాయి సమావేశానికి ఉమ్మడి ఖమ్మం జిల్లా నేతలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయాన్ని కైవసం చేసుకునేందుకు పార్టీ శ్రేణులు విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లాలని ఈ సమావేశంలో పార్టీ అధినేత దిశానిర్దేశం చేశారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్సీ తాతా మధు, ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, బానోత్ హరిప్రియానాయక్, భద్రాచలం నాయకులు మానె రామకృష్ణ, రావులపల్లి రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

– ఖమ్మం/ అశ్వారావుపేట/ ఇల్లెందు/ భద్రాచలం, ఫిబ్రవరి 19



# క్రీడల్లో పాల్గొనడమే మొదటి విజయం

**ఆట ఆడిన ప్రతి ఒక్కరికీ గెలుపు ఉండదు**

**లక్ష్యాన్ని చేరుకోలేకపోయినప్పుడు నిరుత్సాహపడొద్దు**

**దృఢ సంకల్పాన్ని కూడగట్టుకొని ముందుకు సాగాలి**

**వ్యవసాయ వర్సిటీ క్రీడా పోటీల్లో భద్రాద్రి కలెక్టర్**



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జిల్లా కలెక్టర్ జితేశ్ వి పాటిల్

అశ్వారావుపేట, ఫిబ్రవరి 19: క్రీడా పోటీల్లో ప్రతి ఒక్కరికీ గెలుపు ఉండదని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ స్పష్టం చేశారు. అసలు క్రీడల్లో పాల్గొనడమే మొదటి విజయమని తేల్చి చెప్పారు. క్రీడల పట్ల ఎక్కువ మక్కువ ఉన్నప్పటికీ అందరమూ సోషల్ మీడియాలో క్రీడల ప్రాముఖ్యతను షేర్ చేస్తామే గానీ నేరుగా పాల్గొనడం లేదని అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ స్థాయి బోధనా సిబ్బంది క్రీడా, సాహితీ, సాంస్కృతిక పోటీలను స్థానిక వ్యవసాయ కళాశాలలో బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. క్రీడా పోటీలు కూడా వ్యాయామంతో సమానమని తెలిపారు. పోటీతత్వం ఉన్నప్పుడే మనం నిర్దేశించుకున్న లక్ష్యాలకు ఉత్తమ ఫలితాలు అందుకోగలమని అన్నారు. అనుకున్న లక్ష్యం అందుకోలేకపోయినా నీరుగారిపోకుండా మరింత దృఢ సంకల్పంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన బోధనా సిబ్బందికి రాష్ట్ర సరిహద్దులో ఉన్న అశ్వారావుపేట పచ్చని వాతావరణం స్వాగతం పలుకుతోందని అన్నారు. ఈ సందర్భంగా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులందరికీ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా యూనివర్సిటీ డీన్ ఆఫ్ స్టూడెంట్స్ ఎఫైర్స్ డాక్టర్ సీహెచ్ వేణుగోపాల్‌రెడ్డితో కలిసి క్రీడాకారుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ అబ్జర్వర్ డాక్టర్ జే.సురేశ్, వ్యవసాయ కళాశాల అసోషియేట్ డీన్ డాక్టర్ జే.హేమంత్‌కుమార్, ఓఐఎస్‌ఏ డాక్టర్ ఎస్.మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ శ్రావణ్‌కుమార్, యూనివర్సిటీ పరిధిలోని 9 వ్యవసాయ కళాశాలల బోధన సిబ్బంది పాల్గొన్నారు.

### మునగ సాగుకు ప్రోత్సహించండి..

అనంతరం, స్థానిక వ్యవసాయ కళాశాల ప్రాంగణంలో సాగవుతున్న మునగ తోటను కలెక్టర్ జితేశ్ పరిశీలించారు. సాగులో తీసుకుంటున్న జాగ్రత్తల గురించి శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు అధిక ఆదాయం అందించే మునగ సాగు విస్తరణపై దృష్టి సారించాలని సూచించారు. వ్యవసాయ, ఉద్యాన పంటలకు ప్రభుత్వం అందించే రాయితీలను రైతుల్లోకి తీసుకెళ్లాలని ఆదేశించారు. తహసీల్దార్ వనం కృష్ణప్రసాద్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ ఎంపీవో ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

# సర్కారు చోద్యం



ఈమె పేరు మాదాసి సరిత. సింగరేణి ప్రాంతం రుద్రంపూర్ వాసి. పురిటినొప్పులతో రామవరంలోని మాతాశిశు జిల్లా ఆసుపత్రికి వెళ్లింది. ఇక్కడ వెంటిలేటర్ సౌకర్యం లేదని, ఏదైనా జరిగితే తామేం చేయలేమని డాక్టర్లు తేల్చి చెప్పారు. దీంతో చేసేదేమీలేక ఆమె భర్త వరంగల్ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లాడు. అక్కడ సిజేరియన్ చేసి వైద్యులు కాన్పు చేశారు. 12 రోజుల తర్వాత సొంత డబ్బులు పెట్టుకుని అంబులెన్స్‌లో ఇంటికి చేరారు. ఇదీ.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఒక నిరుపేద గర్భిణి గాథ.

## తల్లీబిడ్డల వైద్యం..

పేదలకు అండగా నిలవాల్సిన సర్కారు ఆసుపత్రుల్లో కనీస సౌకర్యాలు మృగ్యమవుతున్నాయి. ముఖ్యంగా గర్భిణుల పరిస్థితి దయనీయంగా ఉంటోంది. జిల్లా మాతాశిశు ఆసుపత్రిలో వెంటిలేటర్ సౌకర్యం లేదంటే అతిశయోక్తి కాదు. 'పేదల ప్రాణాలు గాలిలో కలిసిపోయినా మాకేంటి?' అన్నట్లుగా ఉంది కాంగ్రెస్ ప్రభుత్వ తీరు. గత కేసీఆర్ ప్రభుత్వ పాలనలో గర్భిణులకు మెరుగైన వైద్య సేవలందించేవారు. ప్రత్యేక ప్రోత్సాహకాలూ ఇచ్చేవారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో రూ.వేలకు రూ.వేలు నష్టపోకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే సకల సౌకర్యాలు కల్పించారు. అంతేకాదు, సాధారణ కాన్పులు చేసి తల్లీబిడ్డల ఆరోగ్యాన్ని కాపాడారు. ఇంకా ఆడపిల్ల పుడితే రూ.13 వేలు, మగబిడ్డ పుడితే రూ.12 వేల చొప్పున రెండు కాన్పుల వరకూ ప్రోత్సాహకాలు అందించేవారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఇవేమీ కనిపించడం లేదు. దీంతో పేద గర్భిణుల పరిస్థితి దుర్భరంగా మారుతోంది.

*- భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ)*

- ప్రభుత్వాసుపత్రుల్లో కనీస సౌకర్యాలు మృగ్యం
- జిల్లా మాతాశిశు ఆసుపత్రిలోనూ 'వెంటిలేటర్' లేదు
- 'ప్రైవేట్'ను ఆశ్రయిస్తున్న నిరుపేదలు.. ఆర్థికంగా సతమతం
- అధికారుల పర్యవేక్షణ లేక పెరుగుతున్న సిజేరియన్లు..
- గత కేసీఆర్ ప్రభుత్వంలో ప్రత్యేక ప్రోత్సాహకాలు
- నేటి కాంగ్రెస్ సర్కారు పాలనలో పట్టింపులేనితనం



భద్రాద్రి జిల్లా కేంద్రంలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రం

ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు ఆసుపత్రుల్లో గర్భిణులకు ఎటువంటి ప్రోత్సాహకాలూ ఉండడం లేదు. గత కేసీఆర్ ప్రభుత్వంలో గర్భిణి ఆసుపత్రికి వెళ్తే సకల సౌకర్యాలు కల్పించేవారు. సాధ్యమైనంత వరకూ సాధారణ ప్రసవాలనే సాధారణ ప్రసవాలనే ప్రోత్సహించే వారు. రెండుసార్లు న్యూట్రిషన్ కిట్లు ఇచ్చి గర్భిణులు ఆరోగ్యంగా ఉండేలా చూసేవారు. ఆసుపత్రిలో కాన్పు చేసుకుంటే కేసీఆర్ కిట్‌తోపాటు ఆడపిల్లకు రూ.13 వేలు, మగబిడ్డకు రూ.12 వేల చొప్పున ఇచ్చి పంపేవారు. గతంలో అమ్మ ఒడి వాహనాల్లో గర్భిణులను తీసుకువెళ్లి పరీక్షలు చేయించి ఇంటికి తీసుకొచ్చేవారు. దీంతో పేదవాళ్లకు ఆర్థిక ఇబ్బందులు తప్పేవి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆ పరిస్థితులేమీ లేవు. ప్రభుత్వ ఆసుపత్రిలో సౌకర్యాలు లేకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లక తప్పడం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో అక్కడికి వెళ్తే కోత ఆపరేషన్లు చేస్తున్నారు. తక్కువలో తక్కువ రూ.40 వేల వరకు ఫీజుల వసూలు చేస్తున్నారు.

### పెరిగిన సిజేరియన్లు..

ప్రభుత్వాసుపత్రులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దగా పట్టించుకోకపోవడంతో ఇటు సర్కారు వైద్యశాలల్లోనూ, అటు ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ సిజేరియన్లు గణనీయంగా పెరిగిపోతున్నాయి. సాధారణ ప్రసవాలు చేస్తామంటూ తొలుత ప్రైవేటు ఆసుపత్రులు చెబుతున్నప్పటికీ చివరకు కోతలు కోసి బిడ్డలను బయటకు తీయడాన్ని అలవాటుగా మార్చుకున్నాయి. దీంతో పేదవాళ్లు ఆసుపత్రులకు డబ్బులు పొయ్యలేక అప్పుల పాలవుతున్నారు. భద్రాద్రి జిల్లావ్యాప్తంగా గత ఏడాది (2023) ప్రభుత్వాసుపత్రుల్లో కోత ఆపరేషన్లు 3,662, ప్రైవేటులో 2,908 చేసినట్లు వైద్యశాఖ లెక్కలు చెబుతున్నాయి. జిల్లాలో ఈ ఏడాది (2024)లో 17,294 మంది గర్భిణులు నమోదయ్యారు. వీరిలో 4,626 మంది గర్భిణులు బలహీనంగా ఉన్నట్లు గుర్తించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో 4,860 మందికి సాధారణ ప్రసవాలు చేశారు. 3,662 మందికి సిజేరియన్లు (కోత ఆపరేషన్లు) చేశారు. విచిత్రమేమిటంటే.. ప్రైవేటు ఆసుపత్రుల్లో 931 మందికి నార్మల్ డెలివరీలు కాగా 2,908 మందికి సిజేరియన్లు చేశారు. దీంతో మొత్తంగా కోత ఆపరేషన్లే ఎక్కువగా ఉన్నాయి. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం మాత్రం సాధారణ ప్రసవాలపై దృష్టి పెట్టకపోవడం గమనార్హం.



గర్భిణులుగా ఉన్నప్పుడు కూడా గత ప్రభుత్వం ఇచ్చిన న్యూట్రిషన్ కిట్లు (ఫైల్)

### ప్రైవేటు ఆసుపత్రిలో కాన్పు చేసుకున్నాను..



ప్రభుత్వాసుపత్రిలో ఎలాంటి సౌకర్యాలు లేవు. రక్త పరీక్షల కోసం మాతాశిశు ఆసుపత్రి నుంచి కొత్తగూడెం రావాలి. అత్యవసరమైతే అక్కడ వెంటిలేటర్ లేదు. బయటకు వెళ్లాలంటే అంబులెన్స్ కూడా ఇవ్వరు. అందువల్ల ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లాల్సి వచ్చింది. రూ.20 వేలు అయ్యాయి. మొదటి పాపకు కేసీఆర్ కిట్టు రూ.13 వేలు ఇచ్చారు. రెండో బిడ్డకు ఏమీ లేవు. గత కేసీఆర్ పాలనలోనే గర్భిణులకు మంచి సౌకర్యాలున్నాయి.

**– బానోత్ అరుణ, బాలింత, రుద్రంపూర్‌తండా, కొత్తగూడెం**

### సాధారణ ప్రసవాలే చేస్తున్నాం..



ప్రభుత్వాసుపత్రుల్లో ఎక్కువ మందికి సాధారణ ప్రసవాలే చేస్తున్నాం. ఆరోగ్యం బలహీనంగా ఉన్నవారికి ఆపరేషన్లు తప్పడం లేదు. ప్రైవేటులో సిజేరియన్లు ఎక్కువగా చేస్తున్నట్లు తెలిసింది. వాళ్లకు కూడా చెబుతున్నాం. గర్భిణులు తమంతట తామే సిజేరియన్లు చేయించుకుంటున్నారని ప్రైవేటు ఆసుపత్రులు చెబుతున్నాయి. గత ప్రభుత్వంలో కిట్లు వచ్చాయి. వాటిని గర్భిణులకు ఇచ్చాము. ఇప్పుడు కూడా వస్తే ఇస్తాం. సాధ్యమైనంత వరకు సాధారణ ప్రసవాలు అయ్యేలా ప్రయత్నం చేస్తున్నాం.

**– డాక్టర్ భాస్కర్‌నాయక్, డీఎంహెచ్‌వో, భద్రాద్రి కొత్తగూడెం**

# స్వనిధికి స్వస్తి?

- **వీధి వ్యాపారుల రుణాలకు కేంద్ర ప్రభుత్వం బ్రేక్!**
- **రుణాల కోసం రోజులతరబడి కార్యాలయాలకు..**
- **వెబ్‌సైట్ నిలిపివేతతో ఆందోళనలో స్ట్రీట్ వెండర్లు**



రోడ్ల వెంట వ్యాపారాలు చేసుకుంటున్న చిరు వ్యాపారులు

కొత్తగూడెం అర్బన్, ఫిబ్రవరి 19: వీధి వ్యాపారులకు, చిరు వ్యాపారులకు ఆర్థిక చేయూతనిచ్చేందుకు తీసుకొచ్చిన 'పీఎం స్వనిధి' పథకానికి కేంద్ర ప్రభుత్వం స్వస్తి పలికినట్లుగా కనిపిస్తున్నది. వెబ్‌సైట్ నిలిపివేతతో స్ట్రీట్ వెండర్లు ఆందోళన చెందుతున్నారు. దీంతో వీధి వ్యాపారుల రుణాలకు కేంద్ర ప్రభుత్వం బ్రేక్ వేసిందనే ప్రచారం జరుగుతున్నది మరోవైపు వీధి వ్యాపారులు, చిరు వ్యాపారులు కలిసి రుణాల కోసం రోజుల తరబడి మెప్మా కార్యాలయాల చుట్టూ, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. వీధుల వెంట, రహదారుల పక్కన వ్యాపారులు చేసుకుంటూ జీవించే వీధి వ్యాపారులను, చిరు వ్యాపారులను కరోనా లాక్‌డౌన్ కోలుకోలేని దెబ్బతీసింది. ఆ సమయంలో వ్యాపారాలు నిర్వహించుకునే అవకాశం లేక వారి బతుకులు రోడ్డున పడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో వీరికి ఆర్థిక చేయూతనందించాలని కేంద్ర ప్రభుత్వం భావించింది. ఆ చిరు వ్యాపారాలను సజావుగా నిర్వహించుకునేందుకు వారికి ఇతోధికంగా రుణాలను మంజూరు చేసే పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందుకోసం ప్రధాన మంత్రి స్ట్రీట్ వెండర్స్ ఆత్మ నిర్భర్ నిధి (పీఎం స్వనిధి) పథకాన్ని తీసుకొచ్చింది. దశలవారీగా రుణాలను అందించే కార్యాచరణ చేపట్టింది. మొదటి విడతలో రూ.10 వేలు, రెండో విడతలో రూ.20 వేలు, మూడో విడతలో రూ.50 వేల చొప్పున రుణాలు అందించేందుకు నిర్ణయించింది. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) రిసోర్స్ పర్సన్ల ఆధ్వర్యంలో భద్రాద్రి జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలైన కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు, మణుగూరుల్లో సర్వే నిర్వహించింది. అర్హులకు రుణాలివ్వాలని బ్యాంకులను ఆదేశించింది. అప్పట్లోనే తొలి విడతల్లో కొందరు అర్హులు రుణాలు పొందారు. వాటిని సక్రమంగా చెల్లిస్తున్నారు.

### పథకానికి బ్రేక్!

ప్రస్తుతం పీఎం స్వనిధి పథకానికి కేంద్ర ప్రభుత్వం బ్రేక్ వేసినట్లు కనిపిస్తున్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అందించే ఈ పథకం ద్వారా లబ్ధి పొందాలనుకునే వీధి, చిరు వ్యాపారులకు ఎటువంటి సమాచారం లేకుండానే కేంద్రం నిలిపివేయడంతో అర్హులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తొలి విడతల్లో పొందిన రుణాలను సక్రమంగా చెల్లించిన వారు తదుపరి రుణాలు పొందేందుకు ఇప్పుడు అవకాశం లేకుండా పోయింది. అలాగే, కొత్తగా రుణాలు పొందాలనుకునే వారి ఆశలు ఆవిరయ్యాయి. తమకు మలి విడత రుణాలు మంజూరు చేయాలంటూ వీధి వ్యాపారులు బ్యాంకుల వద్దకు, అధికారుల వద్దకు వెళ్లినా ఫలితం కన్పించడం లేదు. తమ చేతుల్లో ఏమీ లేదని, కేంద్ర ప్రభుత్వం వెబ్‌సైట్‌ను నిలిపివేసిందని సమాధానం చెబుతున్నారు. దీంతో లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఇబ్బందులు పడుతున్న అర్హులు

ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ రోడ్ల వెంట వ్యాపారం చేసుకొని కుటుంబాలకు వెళ్లదీస్తున్న తమకు కేంద్రం రుణాలను నిలిపివేయడంతో తాము మళ్లీ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తున్నదని వీధి వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. కూరగాయలు, పూలు, పండ్లు, గాజులు, ఫ్యాన్సీ వస్తువులు విక్రయించుకుంటూ బతికే తాము.. ఇదివరకు తీసుకున్న రుణాలను క్రమం తప్పకుండా చెల్లిస్తున్నప్పటికీ కేంద్రం ఈ పథకాన్ని ఎందుకు నిలిపివేసిందో అర్థం కావడం లేదంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొదటి విడతగా కొత్తగూడెం, మణుగూరు, పాల్వంచ, ఇల్లెందు మున్సిపాలిటీల్లో మొదటి విడత రూ.10 వేల రుణాల కోసం సుమారు 15,028 మంది దరఖాస్తు చేసుకోగా.. 11,552 మందికి మంజూరయ్యాయి. రెండో విడత రూ.20 వేల రుణాల కోసం 6,667 మంది అర్హత సాధించగా.. 5,740 మందికి మంజూరు చేశారు. మూడో విడత రూ.50 వేల రుణాల కోసం 2,314 మంది అర్హత సాధించగా.. 1,878 మందికి మంజూరు చేశారు. ఈ రుణాలు పొందినవారిలో అత్యధికులు మహిళలే కావడం విశేషం.

### రుణం కోసం వచ్చాను..



వీధి వ్యాపారులకు ఇచ్చే రుణం కోసం కార్యాలయానికి వచ్చాను. మొదటి విడత రుణం తీసుకొని సకాలంలో చెల్లించాను. రెండో విడత రుణం దరఖాస్తు చేసుకుందామంటే వెబ్‌సైట్ పనిచేయడం లేదని అధికారులు చెప్పారు. ఈ రుణం లభిస్తేనే వ్యాపారం చేసుకోగలను. లేదంటే అధిక వడ్డీ అయినా మళ్లీ వ్యాపారులను ఆశ్రయించకతప్పదు.

**–ధను, చిరు వ్యాపారి**

### వెబ్‌సైట్‌ను అప్‌డేట్ చేస్తున్నారు..



పీఎం స్వనిధి వెబ్‌సైట్‌ను అప్‌డేట్ చేస్తున్నారు. అందుకే ఈ రుణాల పంపిణీకి బ్రేక్ పడింది. గత సంవత్సరం డిసెంబర్ 31న ఈ వెబ్‌సైట్‌ను నిలిపివేశారు. వీధి వ్యాపారులకు రుణాల పరిమితిని పెంచుతున్నట్లు కేంద్రం ఇటీవల ప్రకటించింది. వెబ్‌సైట్‌ను అప్‌డేట్ చేసిన తర్వాత అర్హతలను చిరు వ్యాపారులకు రుణాలను ఇస్తాం.

**–శేషాంజన్‌స్వామి, మున్సిపల్ కమిషనర్, కొత్తగూడెం**

- తెలంగాణకు నిధులు తేవడంలో బీజేపీ ఎంపీలు విఫలం
- రాష్ట్రం నుంచి కేంద్ర మంత్రులు ఉన్నా ఉపయోగం సున్నా..
- సామాన్య, మధ్య తరగతి ప్రజలకు ప్రయోజనం ఏమీ లేదు
- కార్పొరేట్లు, సంపన్న వర్గాలకు మేలు చేసేందుకే తాజా బడ్జెట్
- పేదలకు ఉపయోగపడని బడ్జెట్‌ను ఉపసంహరించుకోవాలి
- 'కేంద్ర బడ్జెట్'పై నిరసన కార్యక్రమాల్లో వామపక్ష నేతల ధ్వజం

# కేంద్రానిది ప్రజా వ్యతిరేక బడ్జెట్


*ఈ నెల ఒకటో తేదీన కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టినది ప్రజా వ్యతిరేక బడ్జెట్ అని ఉమ్మడి ఖమ్మం జిల్లా వామపక్ష నేతలు విమర్శించారు. ఈ బడ్జెట్ వల్ల సామాన్య, మధ్య తరగతి ప్రజలకు ప్రయోజనం ఏమీ లేదని ఆరోపించారు. కేవలం కార్పొరేట్లు, సంపన్న వర్గాలకు మేలు చేసేందుకు మాత్రమే దీనిని ప్రవేశపెట్టినట్లు ధ్వజమెత్తారు. దేశంలోని పేదలకు ఉపయోగపడని ఈ బడ్జెట్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలమైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని ఆరోపిస్తూ ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా వామపక్ష నేతలు బుధవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అన్ని మండలాల్లో కేంద్రాల్లోనూ నిరసన ర్యాలీలు, దిష్టిబొమ్మల దహనాలు, బడ్జెట్ ప్రతుల దహనాలు వంటి ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. భద్రాద్రి జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో జరిగిన ఆందోళన కార్యక్రమంలో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడారు. తాజా బడ్జెట్‌పై కేంద్ర ప్రభుత్వం పునరాలోచించాలని, ప్రజల ప్రత్యామ్నాయ ప్రతిపాదనలను బడ్జెట్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. సీపీఎం నేతలు అన్నవరపు కనకయ్య, మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. తెలంగాణకు నిధులు తేవడంలో బీజేపీ ఎంపీలు విఫలమయ్యారని, రాష్ట్రం నుంచి కేంద్ర మంత్రులున్నా ప్రయోజనం లేకపోయిందని విమర్శించారు.* *-నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, ఫిబ్రవరి 19*



టేకులపల్లి: నల్లబ్యానర్‌తో నిరసన తెలుపుతున్న నాయకులు



దమ్మపేట: నిరసన తెలుపుతున్న వామపక్షాల నాయకులు



కరకగూడెంలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలుపుతున్న సీపీఐ, సీపీఎం నాయకులు



పాల్వంచ: ధర్నాలో మాట్లాడుతున్న వామపక్షాల నాయకులు



కొత్తగూడెం అర్బన్: ధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని



భద్రాచలం: నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు



ములకలపల్లిలో మాట్లాడుతున్న సీపీఎం నేత అన్నవరపు కనకయ్య



ఇల్లెందు: నిరసన తెలుపుతున్న వామపక్షాల నాయకులు